క్లుప్తంగా

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: గత పద్నాలుగేళ్లుగా వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు నిర్విరామంగా అందించడం గొప్ప విషయమని ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. మంగళవారం వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆనందా గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ పురోగతి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున మొత్తం వృద్ధాప్య పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్ ముగిది శ్రీనివాసరావు, రిటైర్డ్ టీచర్ పడాల సత్యనారాయణరెడ్డి, క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు పాల్గొన్నారు.

శిశువు చికిత్సకు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామానికి చెందిన చోడదాసి వెంకట రమణ, కేతన దంపతులకు జన్మించిన శిశువు ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఇప్పటికే తల్లిదండ్రులు రూ.20లక్షలు వరకు ఖర్చు చేశారు. ఇంకా మరో రూ.10లక్షలు అవసరం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధిత దంపతులను పరామర్శించారు. తన వంతుగా రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడియం: మండలంలోని బుర్రిలంకలో అత్యాచారానికి గురైన రౌతు కస్తూరి కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పి, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్, యువ మోర్చా నాయకులు బాల సుబ్రమణ్యం, శివప్రసాద్, గోవింద్, మహిళా మోర్చా నాయకురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖాధికారి డి.సుధీర్ కుమార్, మండల వ్యవసాయాధికారి ఏ.భీమ రాజులు అన్నారు. మంగళవారం శాటిలైట్ సిటీ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖాధికారి డి.సుధీర్‌కుమార్ రబీ సీజన్ జీడి మామిడి పంట బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. మూడేళ్లు దాటిన జీడి మామిడి పంటకు ఎకరాకు రూ.1500లు బీమా ప్రీమియం రైతులు చెల్లిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, హార్టికల్చర్ అసిస్టెంట్ జి.ప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: బఘీర
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: లక్కీ భాస్కర్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: భూల్‌భులాయియా-3
ఊర్వశి	: అమరన్
మేనక	: విశ్వం
కుమారి	: దేవర
అప్సర నామవరం	: లక్కీ భాస్కర్
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: లక్కీ భాస్కర్, క
మురళీకృష్ణ కడియం	: లక్కీ భాస్కర్
వెంకటసూర్య	: లక్కీ భాస్కర్

ఎవరి వాటా వారిది..!

- ఇసుక దందాలో జేబులు నింపుకొంటున్న టీడీపీ, జనసేన నాయకులు
- అధికారులదీ అదే తీరు
- అధిక ధరలతో బెంబేలెత్తుతున్న నిర్మాణ రంగం
- పనుల్లేక కూలీలు సతమతం



ధవళేశ్వరం ఇసుక పాయింట్ వద్ద ఆర్‌డీవో సీజ్ చేసిన లారీ

రాజమహేంద్రవరం రూరల్: అధికారంలోకి వచ్చేంత వరకు గత ప్రభుత్వం ఇసుక అక్రమాలపై ఒటికాలిపై లేచిన టీడీపీ, జనసేన నాయకులకు ప్రస్తుతం జరుగుతున్న అక్రమాలు కనిపించకపోవడం శోచనీయం. ఇసుక దందాకు వారే మూల కారణంగా నిలవడంతో ప్రస్తుతం అధిక ధరలకు ఇసుకను కొనలేక నిర్మాణ రంగం కుదేలైపోతోంది. నిర్మాణ రంగంపై ఆధారపడిన అనుబంధ రంగాల్లో అభివృద్ధి సైతం నేల చూపులు చూస్తోంది. నాలుగు యూనిట్ల ఇసుక లారీని రూ.20 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక ఆదాయం నేరుగా ప్రభుత్వానికి జమ అయ్యేది. కానీ ప్రస్తుతం టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వానికి పైసా ఆదాయం రాకపోగా, ఇసుక కొనాలంటే జనాల చేతి చమురు వదులుతోంది. తద్వారా ప్రజల సొమ్ము అక్రమంగా కూటమి నాయకుల జేబుల్లోకి చేరుతోంది.

వైరల్‌గా మారిన సోషల్ మీడియా పోస్టు

ఇసుక అధిక ధరలు నిర్మాణ రంగం, దానిపై ఆధారపడిన అనుబంధ రంగాలన్నింటినీ దారుణంగా దెబ్బతీస్తున్నప్పటికీ కూటమి నాయకులు నోరు మెదపక పోవడం పట్ల సర్వత్రా విమర్శలు రేగుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు జిల్లా కలెక్టర్లను పర్యవేక్షించాలంటూ తూతూ మంత్రంగా ఆదేశాలిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం అక్రమ ఇసుక ధరలను అదుపు చేయకుండా చేష్టలుడిగి చూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో దారుణంగా ధరలను పెంచి సామాన్యులను దోచుకుంటున్నప్పటికీ జిల్లా కలెక్టర్ ఎందుకు అదుపు చేయలేకపోతున్నారంటూ ఒక బీజేపీ నాయకుడు సోషల్ మీడియా వేదికగా ఆవేదనను వెళ్లగక్కడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఇసుక దందాలో టీడీపీ, జనసేన నాయకులు మీకింత..మాకింత లెక్కన పంపకాలు చేసుకున్నారు. ఇందులో బీజేపీ నాయకులు దూరం పాటిస్తున్నారు. రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరం గ్రామానికి చెందిన ఓ బీజేపీ నాయకుడు ఒంటెద్దు స్వామి దారుణ దోపిడీపై సోషల్ మీడియాలో తన ఆవేదనను వెళ్లగక్కారు.



బీజేపీ నాయకుడు ఒంటెద్దు స్వామి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు

పనులు లేక పస్తులు

గత కొంత కాలంగా ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. దీంతో కుటుంబాలతో అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం వారు ఉచిత ఇసుక అని చెబుతున్నారే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–ఈ.శ్రీనివాసరావు, తాపీమేస్త్రీ, రాజమహేంద్రవరం.

మార్గదర్శకాలు పాటించాలి

ఇసుక పాయింట్ వద్ద ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి. ధవళేశ్వరం ఇసుక పాయింట్ వద్ద ఎటువంటి బిల్లులు లేని మూడు లారీలను సీజ్ చేశాం. ట్రాక్టర్ల ద్వారా ఇసుక ఉచితంగా తీసుకొని వెళ్లవచ్చు. ఇందుకు గానూ సంబంధిత గ్రామ అధికారి ద్వారా పొందిన ధ్రువ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది.

–ఆర్.కృష్ణనాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారి, రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో నేడు జాబ్‌మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. డిగ్రీ అర్హత కలిగిన వారితో పాటు 2024లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు సైతం హాజరు కావచ్చని తెలిపారు. పది కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఉదయం 10 గంటలకు కళాశాల సెమినార్ హాల్‌లో హాజరు కావాలని కోరారు.

డైట్‌లో పాము కలకలం



డైట్‌లో పట్టుకున్న పాముతో స్నేక్ క్యాచర్ మాధవ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో మంగళవారం పాత భవనంలోని గదిలోకి పాము వెళ్లడంతో ఛాత్రోపాధ్యాయులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే డైట్ ప్రిన్సిపాల్ డా.ఏఎం జయశ్రీ దృష్టికి ఈ విషయాన్ని అధ్యాపకులు తీసుకువెళ్లారు. దీంతో రాజమహేంద్రవరానికి చెందిన స్నేక్ క్యాచర్ మట్టాడి మాధవ్‌ను పిలిపించారు. అతడు గదిలో ఉన్న పామును పట్టి సీసాలో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



బొమ్మూరు వడ్డి వీరభద్రనగర్ నాగమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



హుకుంపేట డీ బ్లాకులో పుట్టా గంగాలమ్మకు పూజలు



పాములగుడి వద్ద మహిళల పూజలు

భక్తి ప్రపత్తులతో నాగుల చవితి

- నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. తోటల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాణ సంచా కల్చారు. బొమ్మూరు వడ్డి వీరభద్రనగర్‌లో వేంచేసియున్న స్వయంభూ నాగమ్మతల్లి ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని, ఆలయ ఆవరణలో ఉన్న పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు పాలూరి సోమేశ్వరరావు నేతృత్వంలో వీవీ.నగర్ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హుకుంపేట డీ బ్లాకు గౌతమీనగర్‌లో వేంచేసి యున్న స్వయంభూ పుట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయంలో కంఠమణి వీరభద్రరావు, కంఠమణి సుబ్బారావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుకుంపేటలోని ప్రత్యక్ష నాగదేవత ఆలయం(పాములగుడి)లో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పాములు ప్రత్యక్షమైన నుయ్యి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాగుల చవితి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పుట్టల సమీపంలోని కొమ్మలు, రెమ్మలను నరికి శుభ్రం చేసి నాగేంద్రుడికి పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి చిమ్మిలి, చలిమిడి తదితర పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లోని నాగేంద్రుడి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. జిల్లాలోని ప్రముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు నాగుల చవితి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కడియం: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. చిన్నారులు, మహిళలు పుట్టల వద్ద సందడి చేశారు.

ఛాందసవాదులకు ఎదురొడ్డిన ధీశాలి రాజ్యలక్ష్మి



కందుకూరి దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాఘవకుమారి

నన్నయ యూనివర్శిటీ వీసీ వై.శ్రీనివాసరావు

సీటీఆర్ఐ: ఛాందస వాదులను నిర్భయంగా ఎదుర్కొన్న ధీశాలి కందుకూరి రాజ్యలక్ష్మి అని వక్తలు కొనియాడారు. మంగళవారం రాజ్యలక్ష్మి 173వ జయంతి సందర్భంగా స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జయంతి వేడుకలు జరిగాయి. కందుకూరి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ సంస్కరణోద్యమంలో కందుకూరి ప్రకాశం పంతులు ఎటువంటి పాత్ర పోషించారో రాజ్యలక్ష్మి కూడా అంతే పాత్ర పోషించారు. వితంతు వివాహాలు జరిపించడంలో ఆమె ప్రధాన పాత్ర పోషించారన్నారు. స్త్రీకి విద్య అవసరం అని ఆ రోజుల్లోనే గుర్తించి వారికి విద్యని అందించటం ద్వారా సంఘ సంస్కరణలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ చాప్టర్ ప్రెసిడెంట్ టీవీ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రాఘవ కుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కెఎస్ రత్నకుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలి



జిల్లా వ్యవసాయాధికారి మాధవరావును కలిసిన ఏఈఓలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి వ్యవసాయ విస్తరణాధికారులు తోడ్పడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి వ్యవసాయ విస్తరణాధికారులుగా పదోన్నతి పొందిన వారు మంగళవారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి మాధవరావును మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా చేరిన వ్యవసాయ విస్తరణ అధికారులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని, రైతులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని డీఏఓ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షులు డి వేణుమాధవ రావు, ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ లాలాచెరువు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మగ్గం, టైలరింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మంగళవారం తెలిపారు. ఈ రెండు కోర్సులలో ప్రవేశానికి గానూ కనీసం పదో తరగతి చదవిన వారికి అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 18 సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ ఉచిత శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని తెలిపారు.

స్కిల్ సెన్సెస్ సర్వేపై శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన స్కిల్ సెన్సెస్ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ సెన్సెస్ సర్వేకు 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుషులు, మహిళలకు వివిధ విభాగాలలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కెఎస్ ఆర్మ్‌స్ట్రాంగ్, మండల కో ఆర్డినేటర్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు అందజేత

మధురపూడి: కార్తికమాసం సందర్భంగా కోరుకొండలో కొలువు దీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అన్న సమారాధన నిమిత్తం బీజేపీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి రూ.50 వేలు వితరణ చేశారు. చాలా కాలంగా స్వామివారి ఆశీస్సులతో రాజకీయాల్లో కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో నెలంతా భక్తులకు నిత్యాన్నదానం నిర్వహించాలని నిర్ణయించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ఆందోళన



ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేసి ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తూ పేద ప్రజల కుటుంబాల్లో దీపం పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలతో మరోవైపు ప్రజలకు వాతలు పెడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. చార్జీలు తగ్గించాలంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వడియార్, మోతా శారద, చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డైట్ ఛాత్రోపాధ్యాయినులకు బహుమతుల ప్రదానం



విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ డా.జయశ్రీ, విద్యావికాస్ సర్వీస్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు డైట్‌లో మంగళవారం విద్యావికాస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ నాలెడ్జ్, వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ డా.ఏఎమ్. జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులలో జ్ఞానభివృద్ధికి విద్యావికాస్ సర్వీస్ సొసైటీ కోఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు పోటీలు నిర్వహించడం వాటికి స్పాన్సర్‌గా యూనియన్ బ్యాంక్ రిటైర్డు మేనేజర్ ఎం.సూర్యనారాయణ వ్యవహరించటం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు కె.వి.సూర్యనారాయణ సమన్వయకర్త గానూ, వ్యాస రచన పోటీలకు ఆర్‌జేడీ రాజు, సుజాతా రత్నం, డీఎస్‌వి.సత్యనారాయణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఎం.జయశ్రీ, ఆధ్వర్యంలో విద్యావికాస్ సర్వీస్ సొసైటీ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, స్పాన్సర్ ఎం.సూర్యనారాయణల చేతుల మీదుగా విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

రాజానగరం: ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తరగతి వారీగా కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించవలసిన అవసరం ఉందని కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను మంగళవారం సందర్శించారు. 2026 నాటికి ఒకటి, రెండు తరగతుల విద్యార్థులందరికి చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ప్రాథమిక విద్యాబోధన చేసే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసించేందుకు ఇస్తున్న ఈ శిక్షణను ఉపాధ్యాయులు బోధనలో ఉపయోగించి, సత్ఫలితాలను అందుకోవాలన్నారు. రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్ పాల్గొన్నారు.